సాక్షి
వికారాబాద్
ఆదివారం ၊ 14 ၊ జూలై ၊ 2024



నిధులు రాక..
పంచాయతీల ప్రత్యేక పాలన గాడితప్పింది. నిధుల లేమితో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. 8లో▸



ఉపాధ్యాయ వృత్తి గొప్పది
ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పరిగి శాసనసభ్యుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



మోక్షమెన్నడో?
పేదల సొంతింటి కల కలగానే మిగిలి పోతోంది. ప్రభుత్వాలు మారుతున్న ఎదురుచూపులు తప్పడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని అర్హత ఉన్న గృహజ్యోతి పథకం అందని వారు ప్రజా పాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇల్లు మారినప్పుడు, విద్యుత్ మీటర్ యూనిక్ సర్వీస్ నంబర్ అనుసంధానంలో లోపాల వల్ల ప్రయోజనాలు పొందలేని వారు వివరాలు సవరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. దరఖాస్తులో తప్పులు దొర్లిన వారు సరిచేసుకునేందుకు ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గృహ జ్యోతి కింద విద్యుత్ బిల్లు, గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అందకుంటే రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదుతో పాటు ప్రజాపాల సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తమ దరఖాస్తులో ఉన్న తప్పులను సరి చేసుకోవాలని సూచించారు.

రెండు పూటల పని విధానం రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్

అనంతగిరి: మున్సిపల్ కార్మికులకు అదనపు పనులు తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన వికారాబాద్‌లో మున్సిపల్ కార్మికులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మైపాల్ మాట్లాడుతూ.. ఉదయం 5గంటల నుంచి 12గంటలవరకు 8గంటల పని విధానం కొనసాగించాలన్నారు. రెండు పూటలు పని చేయించవద్దన్నారు. ఎన్నడు లేని విధంగా డ్యూటీలు దూరంగా వేస్తూ రెండు పూటల పని విధానం రద్దు చేయాలన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమలలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గురుగుబెల్లి యతిరాజులు

నందిగామ: న్యాయ శాస్త్రం అభ్యసించే విద్యార్థులు చట్టాలపై లోతైన అవగాహన పెంచుకోవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గురుగుబెల్లి యతిరాజులు సూచించారు. మోదళ్లగూడ శివారులోని సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలోని లా కాలేజీలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సుతో పాటు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యతిరాజులు మాట్లాడుతూ.. చట్టాల్లో వస్తున్న మార్పులు, ప్రపంచ వ్యాప్తంగా పలు కోర్టులు ఇస్తున్న తీర్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ మేరకు పుస్తకాలను అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం కళాశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగాష్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతారంలో మైనింగ్ వద్దు



మైనింగ్ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

చేవెళ్ల: మండలంలోని అంతారం గ్రామంలో నిర్వహిస్తున్న మైనింగ్ తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని, కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.మహేందర్ డిమాండ్ చేశారు. గ్రామంలో మైనింగ్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని శనివారం సంఘం నాయకులు పరిశీలించారు. మైనింగ్‌తో చుట్టు పక్కల గ్రామాలకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టను ఇప్పటికే నేలమట్టం చేశారని అన్నారు. ఈ నేలలో విలువైన ఖనిజ సంపదను దోచుకునేందుకు మైనింగ్ కాంట్రాక్టర్ అధికారులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపారని ఆరోపించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారే కానీ వారు దీనిని వ్యతిరేకించడాన్ని మాత్రం లెక్కలోకి తీసుకోవటం లేదన్నారు. మైనింగ్ తవ్వకాలతో జరుగుతున్న నష్టాలను గుర్తించి వెంటనే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అడుగంటిన ప్రాజెక్టు, శిథిలమైన తూము

దశ మారేనా!

జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి పటిష్ట చర్యలు

- అధికారులతో కలిసి సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే
- మరమ్మతు పనుల అంచనా వ్యయం తయారీలో ఇరిగేషన్ అధికారులు
- ఆశలు పెంచుకుంటున్న ఆయకట్టు రైతులు

యాలాల: జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు నడుం బిగించారు. మరమ్మతులకు గురైన కాల్వలు, తూముల ప్రాజెక్టు అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర స్థాయి ఈఎన్‌సీ అధికారులతో కలిసి ఇటీవల ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించారు. చెవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సైతం ప్రాజెక్టు అభివృద్ధిపై దృష్టి సారించారు. దీంతో జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధి పనులపై ఆయకట్టు రైతులు కోటి ఆశలు పెంచుకుంటున్నారు.

2,450 ఎకరాల ఆయకట్టు

జుంటుపల్లి ప్రాజెక్టు 22 నీటి అడుగుల సామర్థ్యం, 2,450 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ప్రాజెక్టు దిగువన కుడి కాల్వ(1,225 ఎకరాల ఆయకట్టు), ఎడమ కాల్వ(1,225 ఎకరాల ఆయకట్టు) ఉన్నాయి. ఆయా కాల్వల పరిధిలో జుంటుపల్లి, పగిడిపల్లి, పేర్కంపల్లి, పేర్కంపల్లితండా, ఎన్కేపల్లి, మల్‌రెడ్డిపల్లి, అక్కంపల్లి, చెన్నారం, అగ్గనూరు తదితర గ్రామాల వ్యవసాయ భూములున్నాయి. రెండు కాల్వలు సుమారు 4.5 కిలోమీటర్ల దూరం వరకు వ్యాపించి ఉన్నాయి. ఆయకట్టు రైతులు వరి, వేరుశనగా పంటల సాగుతో లబ్ధి పొందుతున్నారు.

చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

జుంటుపల్లి ప్రాజెక్టు తూము, కాల్వలు మరమ్మతుకు గురయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ప్రాజెక్టు అభివృద్ధి పనుల పట్ల దృష్టిసారించకపోవడంతో ఆయకట్టు చివరి వరకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మరమ్మతు పనులకు నిధులు కేటాయించినప్పటికీ.. అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కాల్వల మరమ్మతు, తూములు, అలుగు దిగువన ఉన్న పనులను గుర్తించి అంచనా వ్యయాన్ని తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు వ్యయ పట్టికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రాథమికంగా సుమారు రూ.9 కోట్ల అంచనా వ్యయాన్ని తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. నిధులు మంజూరైన వెంటనే టెండరు ప్రక్రియ పూర్తి చేసి అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

బోటింగ్ ఏర్పాటుకు చర్యలు

చెవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సైతం ప్రాజెక్టు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ధారూరు మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో అక్కడ పర్యాటకుల రద్దీ పెరిగింది. కాగా జుంటుపల్లి ప్రాజెక్టు చుట్టూ గుట్టలు, అటవీ ప్రాంతంతో ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తుంది. ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులు సమీపంలో జుంటుపల్లి సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సైతం దర్శించుకునే అవకాశం ఉంటుంది. ప్రాజెక్టు మరమ్మతుల అనంతరం వరదనీరు చేరిన తరువాత బోటింగ్‌కు చేయడానికి ఉండే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రాజెక్టులో బోటింగ్ ప్రారంభిస్తే పర్యాటకుల రద్దీ పెరిగి స్థానికులకు సైతం ఆదాయ మార్గాలు పెరిగే అవకాశం ఉంది.

ట్యాంకు తరహాలో తూములు

జుంటుపల్లి ప్రాజెక్టు కాల్వలు, తూముల మరమ్మతు పనులకు కావాల్సిన నిధుల అంచనాను తయారు చేస్తున్నాం. తూముల మరమ్మతులో భాగంగా వాటిని కొత్తగా ట్యాంకు తరహాలో మార్పు చేయబోతున్నాం. కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలుగు దిగువన క్రాసింగ్ బ్రిడ్జికి సైతం మరమ్మతులు చేపట్టబోతున్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– కిష్టయ్య, ఇరిగేషన్ డీఈ, తాండూరు



జుంటుపల్లి ఎడమకాల్వ సైడ్‌వాల్ దుస్థితి

ఆస్పత్రి భవనం.. మందగమనం

- నత్తనడకన నిర్మాణ పనులు
- రూ.30 కోట్ల వ్యవయంతో 330 పకడలతో జనరల్ ఆస్పత్రి ఏర్పాటు
- ఏడాది గడువు.. రెండేళ్లు కావస్తున్నా పూర్తికాని పనులు
- వంద పడకల పాత భవనంలో జనరల్ ఆస్పత్రి సేవలు
- ఇబ్బంది పడుతున్న రోగులు

వికారాబాద్: ఆర్భాటంగా ప్రారంభమైన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవన నిర్మాణాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏడాది గడువులో నిర్మాణం పూర్తి చేయాలని టెండర్లు ఆహ్వనిస్తే రెండేళ్లు కావస్తున్నా పనులు మాత్రం పూర్తవ్వడం లేదు. గత ప్రభుత్వం ఆర్భాటంగా పనులు ప్రారంభించినా బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో కాంట్రాక్టర్లు సైతం పనులు నెమ్మదిగా చేపడుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు ఏరియా ఆస్పత్రి వంద బెడ్లతో సేవలందించగా.. నూతనంగా 330 పడకల జనరల్ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. జనరల్ ఆస్పత్రి సేవలు ఇప్పటికే ప్రారంభమైనా భవన నిర్మాణ పనులు జాప్యమవుతున్నాయి. తామే మాంజూరు చేయించామని ఆర్భాటం చేసే నేతలు బిల్లులు రాకపోయినా.. పనులు చేపట్టక ఆలస్యం జరిగినా.. పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

330 బెడ్లతో జనరల్ ఆస్పత్రి

గతేడాది ప్రభుత్వం వికారాబాద్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేసిన విషయం విదితమే. వంద సీట్ల సామర్థ్యంతో ఈ ఏడాది నుంచి మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం రూ.240 కోట్లతో మెడికల్ కళాశాల వికారాబాద్‌కు మంజూరు చేయగా ఇందులో మెడికల్ కళాశాలకు అనుబంధంగా జనరల్ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు. 330 పడకల సామర్థ్యంతో జనరల్ ఆస్పత్రి ఏర్పాటు కానుండగా ప్రస్తుతం రూ.30 కోట్లతో ఎస్ఏపీ కళాశాల ఎదురుగా జనరల్ ఆస్పత్రి కోసం భవణం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం బస్టాండ్ దారిలోని ఏరియా ఆస్పత్రి పాత భవణంలోనే జనరల్ ఆస్పత్రి సేవలు కొనసాగిస్తున్నారు. అనంతగిరి గుట్టపై టీబీ శానిటోరియం ఆవరణలో నిర్మించిన తాత్కాలిక భవనంలో మెడికల్ కళాశాల తరగతులు నడుస్తున్నాయి. అనంతగిరి వెళ్లే దారిలో ఉన్న బిల్ల దాఖలా ఏరియాలో మెడికల్ కళాశాల భవణ నూతన భవనం నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బిల్లుల జాప్యం వల్లే ఆసల్యం

బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం చేస్తున్న జాప్యంతోనే జనరల్ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నట్లు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. రూ.30కోట్ల వ్యయంతో భవణ నిర్మాణ పనులు చేపడుతుండగా ఇప్పటికే వరకు 80శాతం పనులు పూర్తి చేశారు. బిల్లులు మాత్రం 30 శాతం లోపే చెల్లించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు నెలల తరబడి పనులు నిలిపి వేస్తున్నారు. ఈ విషయమై తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా రెండు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు.



వికారాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం

ఫ్రెండ్లీగా ఉండండి

- ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి
- ఎస్పీ నారాయణరెడ్డి

దోమ: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఆయన పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌తో కలిసి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, క్వాటర్స్ భవనాలు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో ఎంట్రీ చేసి ఫాలోఅప్ చేయాలన్నారు. ప్రతీ ఫిర్యాదు దారుడికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100కి వచ్చిన కాల్స్‌ను వెంటనే స్పందించి ఘటనా స్థలికి త్వరగా చేరేలా శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో నిఘా పటిష్టంగా ఉండేలా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. ఇసుక, గంజాయి, డ్రగ్స్, గుట్కా తదితర మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు పోలీస్ సిబ్బంది ఎస్పీ నారాయణరెడ్డికి గౌరవ వందనం చేసి పూల మొక్కలతో ఆహ్వానం పలికారు.



దోమ ఠాణాలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

కొత్త చట్టాలపై అవగాహన పెంచాలి

నూతన చట్టాలపై ప్రజలకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన ఉంటే లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉండందన్నారు. గ్రామాలలో గొడవలకు తావు లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆనంద్ కుమార్, ఏఎస్ఐ సూర్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్స్ నర్సింహులు, భీంరెడ్డి, సుదర్శన్ రెడ్డి, కానిస్టేబుల్స్ పురుషోత్తం, నరేశ్, నారాయణరెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందేలా చూడండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి భూ నిర్వాసితుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల పరిధిలోని బండరావిరాల సర్వే నంబర్ 268లోని మైనింగ్‌జోన్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాలకు చెందిన నిర్వాసితులు బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిశారు. కొన్నేళ్లుగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తూ వస్తున్నాయని అన్నారు. తమకు నష్టపరిహారం అందించడంతో పాటు అక్రమంగా కొనసాగుతున్న మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రతాప్, పాపయ్య గౌడ్, కొండల్ రెడ్డి, అంజయ్య, ప్రేమ్, శ్రవణ్ చారి, కుమార్ గౌడ్, లింగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• గోరింట పూసింది

వికారాబాద్ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆషాఢ మాసం గోరింటాకు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకుని ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ ఉత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు మ్యాదం లక్ష్మి, ప్రతినిధులు పోకల మమత, యాస్కి సువర్ణ, కుంచం శ్రీదేవి, కొట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ మోముల స్వాతి, ఆర్యవైశ్య సంఘం కార్యవర్గసభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– అనంతగిరి



ఆస్తి కోసమే తండ్రి హత్య

- వీడిన కమ్మరి కృష్ణ హత్య మిస్టరీ
- బాడీ గార్డుతో సుపారీ మాట్లాడుకుని అంతమొందించిన కొడుకు
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
- రెండు కార్లు, కత్తులు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్

షాద్‌నగర్ రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారి కమ్మరి కృష్ణ అలియాస్ కేకే హత్య మిస్టరీ వీడింది. ఆస్తి కోసం కన్నకొడుకే తండ్రిని హత్య చేయించాడు. తండ్రి సంపాదించిన ఆస్తిలో తమ వాటా తగ్గుతుందనే ఉద్దేశంతో బాడీ గార్డుకు సుపారీ ఇచ్చి అంతమొందించాడు. కమ్మదనం గ్రామ శివారులో ఈనెల 10న జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను శనివారం షాద్‌నగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ రాజేశ్ విలేకరులకు వెల్లడించారు.

ముగ్గురితో వివాహం

రాజేంద్రనగర్ పరిధిలోని బండ్లగూడ జాగీర్, సన్‌సిటీ రఘురాంనగర్ కాలనీకి చెందిన కమ్మరి కృష్ణ షాద్‌నగర్ పరిధిలోని కమ్మదనం శివారులో వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేసి అందులో ఫాంహౌస్ నిర్మించాడు. ఇతనికి ముగ్గురు భార్యలు. మొదటి భార్య పక్షవాతంతో మంచానికే పరిమితమైంది. అనంతరం రెండో వివాహం చేసుకోగా కరోనా సమయంలో ఆమె హఠాత్తుగా మరణించింది. దీంతో పావని అనే మహిళను మూడో పెళ్లి చేసుకుని తన ఫాంహౌస్‌లో ఉంచి, అప్పుడప్పుడూ వచ్చివెళ్తుండేవారు. ఇదిలా ఉండగా పెద్ద భార్యకు ఇద్దరు కొడుకులు, మూడో భార్యకు 16 నెలల పాప ఉండగా, రెండో భార్యకు పిల్లలు లేరు.

రూ.16 కోట్ల ఆస్తి మార్పిడి

రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కేకే వందల కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించాడు. రూ.16 కోట్ల విలువ చేసే ఓ భవనాన్ని ఇటీవల తన మూడో భా ర్య పావని పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. కొంతకాలంగా పెద్ద భార్య కొడులను పట్టించుకోవడం మానేశా డు. ఈ నేపథ్యంలో కొడుకు శివకు, తండ్రి కృష్ణకు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్

తండ్రి హత్యకు సుపారీ

తండ్రి సంపాదించిన ఆస్తిని మూడో భార్యకే కట్టబెడుతాడని కోపం పెంచుకున్న శివ.. కేకే హత్యకు ప్లాన్ చేశాడు. ఈ నేపథ్యంలో తండ్రి వద్ద బాడీ గార్డుగా పనిచేస్తున్న కాలామందిర్‌కు చెందిన బాబా అలియాస్ శివానంద్‌తో చేతులు కలిపాడు. తన తండ్రిని హత్య చేస్తే రూ.25 లక్షలతో పాటు ఓ ఇల్లు ఇస్తానని సుపారీ మాట్లాడుకున్నాడు.

గొంతుకోసి.. పొట్టలో పొడిచి

కమ్మదనం ఫాంహౌస్‌లో ఉన్న కేకేను హత్య చేసేందుకు బాడీగార్డు బాబా.. బండ్లగూడ జాగీర్, కాలీ మందిర్ ప్రాంతానికి చెందిన జీలకర్ర గణేశ్‌తో పాటు మరో 17 ఏళ్ల మైనర్‌ను పిలిపించాడు. కేకే ఫాంహౌస్‌లో ఉండగా వీరిద్దరూ వెనక నుంచి వచ్చి కృష్ణ చేతులను గట్టిగా పట్టుకున్నారు. అనంతరం బాబా తన వెంట తెచ్చుకున్న కత్తితో కృష్ణ గొంతు కోసి, పొట్టలో పొడిచి హత్య చేశారు.

కార్లు, కత్తులు స్వాధీనం

కృష్ణను హత్య చేసిన తర్వాత బాబా, గణేశ్, మైనర్ బాలుడితో కలిసి కారులో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సమయంలో ఫాంహౌస్ వద్ద ఉన్నవారిని బొమ్మ తుపాకీతో బెదిరించారు. హత్య విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కమ్మరి శివ, బాబా, గణేశ్, మైనర్‌ను పట్టుకున్నారు. క్లూస్ సేకరించిన ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానంతో హత్య మిస్టరీని ఛేదించారు. వీరి నుంచి రెండు కార్లు, ఓ బైక్, మూడు కత్తులు, సెల్‌ఫోన్, రూ.50 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 103, 3(5), 61 బీఎన్ఎస్, 25 (1బీ)(ఏ) ఆమ్స్ యాక్టు కింద కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ రామిరెడ్డి, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐలు వరప్రసాద్, శరత్, శ్రీకాంత్, సుశీలతో పాటు పలువురు సిబ్బందిని అభినందించి, రివార్డులు అందజేశారు.

క్లుప్తంగా

భగీరథ నీటిలో వానపాములు

మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



తాగునీటిలో వానపాములు

తాండూరు టౌన్: మిషన్ భగీరథ తాగునీటిలో వానపాములు ప్రత్యక్షమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణం శాంతినగర్‌లో ఓ ఇంట్లో రోజులాగే శనివారం భగీరథ నల్లా నీటిని పట్టగా.. అందులో వానపాములు వచ్చాయి. ఇది చూసిన సదరు ఇంటి యజమాని.. మున్సిపల్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పగిలిన పైపులైన్లకు మరమ్మతు చేయించపోవడంతోనే తాగునీటిలో వానపాములు వచ్చాయని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. పైపులకు మరమ్మతు చేయించడంతో పాటు, భగీరథ నీరు పూర్తిగా ఫిల్టర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సనాతన ధర్మ పరిరక్షణకు సుదీర్ఘ యాత్ర



యాత్రికుడు రాజేంద్ర శర్మ

తాండూరు టౌన్: సనాతన ధర్మ పరిరక్షణ కోసం హిందువులను ఏకం చేయడానికి యూపీ వాసి సైకిల్‌పై సంపూర్ణ దేశ యాత్ర చేపట్టారు. ఈ క్రమంలో యాత్ర శనివారం తాండూరుకు చేరుకుంది. ఢిల్లీలో స్థిరపడిన రాజేంద్ర శర్మ.. ఈ ఏడాది మార్చిలో అయోధ్య నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించాడు. పలు రాష్ట్రాల మీదుగా తెలంగాణకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడారు. దేశంలోని 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు, 51 శక్తి పీఠాలు, చార్‌ధామ్, పంచకేదార్‌లలో పర్యటిస్తూ సనాతన ధర్మం పరిరక్షణ కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తానన్నాడు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా యాత్ర పూర్తిచేస్తానని స్పష్టంచేశారు.

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

ధారూరు: వారంతపు సెలవు రోజుల్లో సహజంగానే అనంతగిరి, కోట్‌పల్లి ప్రాజెక్టులకు సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం ధారూరు పోలీస్ స్టేషన్ పరిధి అనంతగిరి గుట్ట కింది రోడ్డులో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడపవద్దని, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు.

నిధులు రాక.. పనులు సాగక

- గాడి తప్పిన పంచాయతీ పాలన
- నిలిచిన కేంద్రం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు
- సొంత డబ్బులతో కాలం వెల్లదీస్తున్న కార్యదర్శులు



గ్రామ పంచాయతీ కార్యాలయం

పరిగి: పంచాయతీల ప్రత్యేక పాలన గాడితప్పింది. నిధుల లేమితో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. రోజు వారి నిర్వహణ కష్టతరంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు నెలల తరబడి విడుదల కాకపోవడంతో.. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించలేక జీపీ కార్యదర్శులు ముఖం చాటేస్తున్నారు. ఇక చిన్న పంచాయతీలు చిన్నబోయాయి.

రెండేళ్లుగా కటకట

నవంబర్ 2023 నుంచి కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు జీపీలకు విడుదల కావడం లేదు. ఈ నిధులు ప్రతి మూడు నెలలకు ఒక సారి పంచాయతీలకు రావాల్సి ఉంది. కానీ 9 నెలలుగా అవి రావటం లేదు. ఇప్పటి వరకు పెద్ద జీపీలకు రూ.20 నుంచి రూ.30లక్షల వరకు, చిన్న గ్రామాలకు రూ.10నుంచి రూ.15లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు అక్టోబర్ 2022 నుంచి రావడం లేదు.

ముఖం చూపెట్టలేక..

జిల్లాలో 20 మండలాలకు గాను 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక పోవడంతో కార్మికుల వేతనాలు, విద్యుత్, వీధి దీపాల బిల్లులు, ట్రాక్టర్‌కు నిధులు, బోరు మోటార్ల మరమ్మతులు తదితర పనులకు నిధులు లేక జీపీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పెద్ద పంచాయతీలకు వస్తున్న కొద్దిపాటి ఆదాయంతో అభివృద్ధి, నిర్వహణ పనులు చేపడుతుండగా.. చిన్న గ్రామాల్లో ఎలాంటి పనులు జరగడం లేదు. బిల్లులు, కార్మికుల వేతనాల చెల్లింపుల విషయం, అభివృద్ధి విషయంలో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నామని, ముఖం చూపెట్టలేక పోతున్నామని జీపీ కార్యదర్శులు వాపోతున్నారు.

బదిలీ అయితే ఎలా?

నిధుల లేమి ఉన్నప్పటికీ.. గ్రామాల్లో అరకొర పనులు జరుగుతున్నాయి. చిన్న గ్రామాల్లో కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించి పనులు చేయిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలన్న ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పనుల నిర్వహణ వారికి భారంగా మారింది. అయినా ఎలగోలా నెట్టుకొస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాము బదిలీపై వెళ్తే, ఇప్పటి వరకు అప్పు చేసి పెట్టిన ఖర్చు, సొంత డబ్బుల పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ బకాయిలను మంజూరు చేయించాలని కోరుతున్నారు.

రోహిత్.. ఒరగబెట్టిందేమీలేదు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు

గొప్పలే తప్ప.. చేతల్లో చూపని వ్యక్తి

- ఎమ్మెల్యే బీఎమ్మార్‌ది కుటుంబ పాలన అనడం హాస్యాస్పదం
- మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న మండిపాటు
- అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సవాల్

తాండూరు: 'మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీలేదు. పైగా అన్నీ గొడవలే తెచ్చాడు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరువాత ఏడు నెలలు కనిపించకుండా పోయాడు. ఇప్పుడు వచ్చి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నాడు. ఇది విడ్డూరంగా ఉంది' అని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న ఆగ్రహం వ్యక్తంచేశారు. తాండూరు అభివృద్ధిపై చేసిన విమర్శలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రోహిత్‌రెడ్డికి ఆమె సవాల్ విసిరారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. ఎమ్మెల్యే బీఎమ్మార్‌ది కుటుంబ పాలన అని రోహిత్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన సోదరులు సుద్ద, ఇసుక మాఫియా కొనసాగిస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆయన ఎమ్మెల్యే అయిన ఆరు నెలల కాలంలో ఇసుక డీడీల రూపంలో ప్రభుత్వానికి రూ.2 కోట్ల ఆదాయం సమకూరిందని స్వప్న వివరించారు.

అన్నీ గొప్పలే..

2009లో కాంగ్రెస్ హయాంలో మంజూరైన తాండూరు బైపాస్ రోడ్డును తానే మంజూరు చేయించానని రోహిత్ గొప్పలు చెప్పుకుంటున్నారని స్వప్న ఎద్దేవా చేశారు. ఆయన ఉన్నప్పుడు కేవలం కాగితాలకే పరిమితమైన బషీరాబాద్ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే బీఎమ్మార్ కృషి చేశారని తెలిపారు. చిలుకవాగు ఎవరి హయాంలో కబ్జాకు గురైందో తాండూరు ప్రజలకు తెలుసునని చురకలంటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉత్తమ్‌చంద్, డాక్టర్ సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రవిగౌడ్, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, బాంబినా, విజయదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్లు మాధవరెడ్డి, అంజయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, హబీబ్‌లాల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని అర్హత ఉండి గృహజ్యోతి పథకం అందని వారు ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇల్లు మారినప్పుడు, విద్యుత్ మీటర్ యూనిక్ సర్వీస్ నంబర్ అనుసంధానంలో లోపాల వలన ప్రయోజనాలు పొందలేని వారు వివరాలు సవరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. దరఖాస్తులో తప్పులు దొర్లిన వారు సరిచేసుకునేందుకు ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గృహజ్యోతి కింద విద్యుత్ బిల్లు, గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అందకుంటే రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ప్రజాపాలనలో అర్జీ చేసుకున్న రసీదుతో పాటు ప్రజాపాల సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తమ దరఖాస్తులో ఉన్న తప్పులను సరి చేసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడిపశువు మృతి




పశువు కళేబరం వద్ద బాధిత రైతు

యాలాల: విద్యుదాఘాతంతో ఓ పాడి పశువు మృతి చెందిన సంఘటన మండలంలోని పగిడియాల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నర్సింహులు తన పాడిగేదెను ఎప్పటిలాగే మేతకు తీసుకెళ్లాడు. మేత మేసిన అనంతరం నీరు తాగేందుకు వెళ్లిన ఆ మూగజీవి అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టు వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ.70వేల విలువ గల పశువు మృతి చెందిందని, తనను ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ద్విచక్రవాహనం, జేసీబీ ఢీ..

వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో గాయాలతో పడున్న యాదయ్య

కొందుర్గు: ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామానికి చెందిన గండె యాదయ్య(25) శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై కొందుర్గు మండలం పులుసుమామిడి గ్రామానికి వెళ్లాడు. తిరిగి కొందుర్గు మీదుగా లాల్‌పహాడ్ వైపు వెళ్తున్న క్రమంలో రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జేసీబీ ఢీకొట్టింది. ఈ ఘటనలో యాదయ్య తలకు తీవ్ర గాయం అయింది. సమాచారం అందుకు పోలీసులు.. ప్రమాద స్థలానికి చేరకుని, క్షతగాత్రున్ని చికిత్స కోసం 108లో షాద్‌నగర్ సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల పరీక్షించి యాదయ్య మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి భార్య సంతోష, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

నిషేధిత గుట్కా స్వాధీనం

కర్ణాటక నుంచి తాండూరుకు తరలిస్తుండగా.. పట్టివేత

పెద్దేముల్: కర్ణాటక నుంచి తెలంగాణకు తరలిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. యాలాల మండల రాస్నం గ్రామానికి చెందిన అబ్దుల్ రవూఫ్ శనివారం కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి ఆటో(టీఎస్34, టీబీ6252)లో రూ.61వేయి 530 విలువగల 26,855 గుట్కా ప్యాకెట్లను తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధి సిద్దన్న మడుగుతండా వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను పోలీస్ బ్లూకోల్ట్ డ్యూటీ కానిస్టేబుల్ మున్నయ్య, రవికుమార్‌లు తనిఖీ చేయగా గుట్కా పట్టుబడింది. అనంతరం ఆటోను, సదరు వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



గుట్కా ప్యాకెట్లను చూపిస్తున్న ఎస్ఐ గిరి, సిబ్బంది

పేదలకు వరం సీఎం సహాయనిధి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేద ప్రజలను ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం 80 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదవారికి సీఎమ్మార్‌ఎఫ్ వరంగా మారిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని చెప్పారు. అధిక నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, నాయకులు వసంతం, ఆగిరెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, చెన్నయ్య, జనార్దన్, కవాలి రవీందర్, శేఖర్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.



సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

కేంద్ర మంత్రికి సన్మానం

బండ్లగూడ : బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, భూపాల్‌గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను శనివారం కలిసి సన్మానించారు. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రిని శాలువాలతో సత్కరించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీని బలోపేతం చేసేందుకు కార్పొరేటర్లు కృషి చేయాలని బండి సంజయ్ వారికి సూచించారు.

ఎమ్మెల్యేకు..

రాజేంద్రనగర్ : కాంగ్రెస్ పార్టీ లో చేరిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ బుద్వేల్ గ్రామ అధ్యక్షుడు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కానుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలుగు చెరువు మహేష్, కోరని నరేందర్ ఉన్నారు.



మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్..

కన్నీటిపర్యంతమైన చిన్నారులు.. ఓదార్చిన ఉపాధ్యాయుడు



విద్యార్థులను సముదాయిస్తున్న ఉపాధ్యాయుడు వీరేశం

కొడంగల్ రూరల్: 'సార్ మీరు మమ్మల్ని విడిచి వెళొద్దు. ఇక్కడే ఉండాలి' అని బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని ఆ చిన్నారులు చుట్టుముట్టి కన్నీటి పర్యంతమవగా.. 'నేనెక్కడికి పోతానమ్మా.. అప్పుడప్పుడు వస్తుంటాను. మీరు మంచిగా చదువుకోండి' అని ఆ మాస్టారు పిల్లలను ఓదార్చిన తీరు.. అక్కడున్న వారందరినీ ఆలోచింపచేసింది. ఈ సున్నితమైన అంశం మండల పరిధి అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. ఇక్కడ పనిచేస్తున్న 5మంది ఉపాధ్యాయులు బదిలీపై వేరువేరు ప్రాంతాలకు వెళ్లగా.. వారికి గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. బరువెక్కిన గుండెలతో వీడ్కోలు పలికారు.

బదిలీ బాధాకరం..

ఉపాధ్యాయుడు వీరేశం 2018 జూన్‌లో బదిలీపై అప్పాయిపల్లి పాఠశాలకు వచ్చారు. నాటి నుంచి విద్యార్థులతో స్నేహితుడిగా ఉంటూ.. విద్యాబోధన చేసేవారు. వారిని తీర్చిదిద్దడంలో ఆయన చూపిన శ్రద్ధ.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభిమానం పెంచుకునేలా చేసింది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన బదిలీల్లో ఉపాధ్యాయుడు వీరేశం.. ప్రమోషన్‌పై కరన్‌కోట్ జెడ్పీహెచ్ఎస్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆయన బదిలీని జీర్ణించుకోలేకపోయారు. సన్మాన కార్యక్రమంలో వారందరూ కన్నీళ్లు ఆపుకోలేక విలపించారు. పిల్లలతో మమేకమై పాఠాలు బోధించే ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు

ప్రమాదకరంగా మారిన 'మల్టీపర్పస్'

- అనుభవ లేమితో కార్మికుల మృత్యువాత
- వెంకటప్ప కుటుంబానికి రూ.25లక్షలు పరిహారం చెల్లించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న ఎంపీఓ రమేష్

పెద్దేముల్: మల్టీ పర్పస్ విధానం పేరిట పంచాయతీ కార్మికులతో ప్రభుత్వం అనుభవం లేని పనులు చేయిస్తూ.. వారిని ప్రమాదాల బారిన పడేలా చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. మండల పరిధి ఇందూరులో విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన జీపీ కార్మికుడు వెంకటప్ప కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం ఆయన.. కార్మికుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా జీపీ కార్మికులకు ప్రమాదకరంగా ఉన్నా జీఓ-51ని రద్దు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ఫలితంగా కార్మికులు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్, డీపీఓలు స్పందించి కార్మికులతో ఇలాంటి అనుభవం లేని పనులు చేయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వెంకటప్ప కుటుంబానికి పరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీఓ రమేష్ మృతుడి భార్య సత్తమ్మకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల నగదును అందచేశారు.

ఘనంగా మొహర్రం



మసీదులో కొలువుదీరిన పీర్లు

దుద్యాల్: మొహర్రం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 5వ రోజు సందర్భంగా హస్నాబాద్ గ్రామంలో పీర్లు కొలువు దీరిన మసీదుల వద్దకు భక్తులు బారులు తీరారు. ఊదు, బెల్లం చదివింపులు చేసేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా కొందరు చిన్నారులను పకీర్‌గా తీర్చిదిద్ది, మెడలో జోలె వేశారు. మొహర్రం పూర్తయ్యే వరకు ఆచారం ప్రకారం గ్రామంలోని ఇంటింటికీ తిరిగి జోలె పట్టాల్సి ఉంటుంది. కుదురుమల్ల గ్రామంలో తెల్లవార్లు ప్రత్యేక పూజలతో ఒక మసీద్ నుంచి మరో మసీద్‌కు పీర్ల సామగ్రిని తరలిస్తారు. మసీద్ ఎదుట ఉత్సాహంతో అలైదులై ఆడారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



టీచర్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అన్ని వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి నస్కల్ కేజీబీవీ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు అంజుమ్ జహాన్ మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శనివారం పట్టణ కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. టీఎస్‌యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.6 లక్షల చెక్కును మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సంఘం సమస్యల పరిష్కారంతో పాటు.. సభ్యులు అకాల మరణం పొందితే వారి కుటుంబానికి ఆసరగా నిలవడం అభినందనీయమన్నారు. సంఘం నుంచి కుటుంబ సంక్షేమ నిధిని సేకరించి, ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకోవడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, గాంగ్య, స్వప్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణిస్తున్న బస్సులో కూరగాయల విక్రయం

సామాజిక మాధ్యమాల్లో వీడియో చక్కర్లు



బస్సులో కూరగాయాలు విక్రయిస్తున్న మహిళా రైతు

పరిగి: ఓ మహిళా రైతు తన పొలంలో పండించిన కూరగాయలను విక్రయించేందుకు ఆర్టీసీ బస్సులో సంతకు వెళ్తోంది. అవి తాజాగా ఉండటాన్ని గమనించిన ప్రయాణికులు వాటిని కొనుగోలు చేసిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ వైరల్‌గా మారింది. ఇది పరిగి, మహబూబ్‌నగర్ ఆర్టీసీలో బస్సులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గతంలో కూరగాయల వ్యాపారులు వాటిని విక్రయించేందుకు సంతకు ఆటోలో వెళ్లేవారు. కానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరాక మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో మహిళా రైతులు తమ పొలాల్లో సాగు చేసిన కూరగాయలను స్థానిక సంతలో విక్రయించేందుకు బస్సులో వెళ్తున్నారు. ఈ క్రమంలో రోజులాగే రైతులు సంతలో కూరగాయలు విక్రయించి ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తుండగా పక్కనే ఉన్న ఓ ప్రయాణికులు కొందరు కూరగాయలు ఫ్రెష్‌గా ఉండటం చూసి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఇది గమనించిన ఓ యువకుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. అది వైరల్‌గా మారింది. 'బస్సులో బెండకాయలు అమ్ముతున్న మహాలక్ష్మి' అంటూ వీక్షకులు క్యాప్షన్ తగిలించి.. ఇతరులకు షేర్ చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

షాబాద్: ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి బొబ్బిలిగామ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు, లక్ష్మయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు రమేశ్(24) ఉన్నాడు. ఇద్దరు కూతుర్ల వివాహం అయింది. కుమారుడు రెండేళ్లుగా శంషాబాద్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ.. అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో మూడు రోజులుగా గ్రామంలోని ఇంటి వద్దే ఉన్నాడు. 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పొలం వద్ద పనిచేస్తున్న తండ్రి నర్సింలుకు తాగడానికి నీళ్లు ఇచ్చి ఇంటికి వచ్చాడు. రాత్రి 7 గంటలకు తల్లి లక్ష్మమ్మ ఇంటికి వచ్చి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికీ లోంచి చూడగా రమేశ్ ఉరికి వేలాడుతూ కన్పించాడు. ఇరుగుపొరుగు సహాయంతో తలుపులు పగల గొట్టి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే రమేశ్ మృతిచెందాడు. తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.